చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కే.కోడపల్లి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో డేవిడ్ రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వెయ్యరాదని, షాపులు ముందు చెత్తాచెదారని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని, ప్లాస్టిక్ కవర్లను వాడరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిలకమ్మా, పంచాయతీ సెక్రటరీ, పిసా కమిటీ సెక్రటరీ, వైసిపి నాయకులు పాల్గొన్నారు

చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

పిఎం జన్‌మన్ గృహాల బకాయిలు చెల్లించాలి

▸▸ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స ▸▸ ఐటిడిఎ ఎదుట గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పిఎం జన్ మన్ హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లు బకాయిలు చెల్లించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట ఆదివాసీలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. గిరిజన సంఘం కార్యాలయం నుంచి ఐటిడిఎ గేటు వరకు భారీ ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, పాడేరు డివిజన్ 11 మండలాల్లో రూ.21.54 కోట్ల మేర బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. వెంటనే బిల్లు బకాయిలు చెల్లింపులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పిఎం జన్ మన్ పథకంలో అవినీతికి పాల్పడుతున్న హౌసింగ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో సుమారు 28570 వేలమంది పివిటిజిలకు ఇళ్లు మంజూరు చేశారని, ఒక్కో ఇంటికి రూ.3.39 లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు పెంచకపోవడంతో పివిటిజి తెగల లబ్ధిదారులు తీవ్రమైన అప్పులు పాలయ్యారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పొద్దు బాలదేవ్, పాలికి లక్కు, సుడిపల్లి కొండలరావు, కొర్రా బాలయ్య, కిల్లో సత్యనారాయణ, కొర్రా నర్సయ్య, కొర్రా త్రినాథ్, చిట్టిబాబు, సోమన్న, టీ.సూర్యనారాయణ, జి.బుజ్జిబాబు, జి.చిన్నబాబు, ఎంఎం శ్రీను, హైమావతి, ఈశ్వరి, లక్ష్మణ్ రావు, ఎ.బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న అప్పలనర్స

మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్

స్కూల్ శానిటేషన్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

-సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్

ప్రజాశక్తి - చింతూరు : ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్ల సమావేశానికి ముఖ్య అతిథులుగా చింతూరు సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి ఒక్క కార్మికుల్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆశ్రమ పాఠశాలలో స్కూల్ శానిటేషన్ వర్కర్లు అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, నాలుగు నెలలుగా (మార్చి – జూన్) వారికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. నాలుగు మండలాల్లో ఉన్న స్కూల్ శానిటైజర్ వర్కర్లు అందరినీ ఐక్యం చేసి ఐటిడిఎ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా జూలై 9న జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ శానిటేషన్ వర్కర్ యూనియన్ నాయకులు నక్క సురేష్, జయలక్ష్మి. రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్

గంజాయి పట్టివేత : నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - కొయ్యూరు : రూ. 1,91,875 విలువ గల 38.375 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మంప ఎస్సై, కొయ్యూరు ఇన్చార్జి ఎస్ఐ శంకరరావు గంజాయి రవాణా గురించి వచ్చిన సమాచారంపై మధ్యాహ్నం మండలంలోని చీడిపాలెం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా జిల్లాలోని గూడెంకొత్తవీధి మండలం, రొంపుల గ్రామానికి చెందిన గొల్లరి బొంజిబాబు అనే వ్యక్తి అన్నవరం నుండి 38.375 కేజీల గంజాయిని నర్సీపట్నంకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ రూ.1,91,875లు ఉంటుందని ఎస్ఐ శంకరరావు తెలిపారు.

నీట్, ఎన్ఐటి శిక్షణా కేంద్రాలు కొనసాగించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:విశాఖపట్నం జిల్లా మారికవలస గిరిజన గురుకుల సంక్షేమ హాస్టల్ దగ్గర అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ మధ్యలో మూసివేసిన నీట్, ఎన్ఐటీ క్లాట్ శిక్షణ కేంద్రం వెంటనే ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె చిన్నం నాయుడు డిమాండ్ చేశారు. అనంతరం విశాఖపట్నం మారికవలస గిరిజన గురుకులం ఆశ్రమ పాఠశాలలో మూసివేసిన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2017-2018 సంవత్సరంలో ఆదివాసీ ప్రాంత గురుకులం మొదటి ఏడాది కాలేజీలో చదివిన టాపర్లను ఎంపిక చేసి మారికవలసలోని (ఎన్ఐటి, నీట్, క్లట్) ఉన్నత చదువుకు వెళ్లాలని ఉద్దేశంతో ప్రత్యేకంగా శిక్షణ నిచ్చి ఏజెన్సీ ప్రాంతం నుండి వందలాది సంఖ్యలో ఉన్నత స్థాయిలో విద్యావకాశాలు పొందారన్నారు.నెలకు ఒక్కొక్క విద్యార్థి వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రవేటు సంస్థల లో ఖర్చుచేసి శిక్షణ పొందుతున్నారన్నారు. సుమారు 90 మంది ఆదివాసీ యువత శిక్షణకు వివిధ రంగ నిపుణులైన విద్యావేత్తలు శిక్షణ నిచ్చి ఉన్నత స్థాయిలో విద్యావకాశాలు పొందుతూ ఐఐటీ,లాసెట్, నీట్ లో వందలాది మంది ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యా అవకాశాలు పొందారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం విశాఖలోని నడిచే శిక్షణ కేంద్రాన్ని కొనసాగించి ఆదివాసీలు నిరుద్యోగులు ఉన్నత స్థాయిలో విద్యావకాశాలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సురేంద్ర, చిన్నంనాయుడు

పాఠశాలకు వెళ్లేందుకు పాట్లు

- బురద రోడ్డులోనే విద్యార్థుల రాకపోకలు

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని కుడుముసారి పంచాయతీ కేంద్రానికి చెందిన గిరిజన చిన్నారులు ప్రతిరోజూ చదువు కోసం పాఠశాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కుడుముసారి గ్రామంలోని పాఠశాల గ్రామానికి దూరంగా ఉంది. వర్షాకాలంలో పాఠశాల రహదారి విపరీతమైన బురదమయమ వుతుంది. బురద మట్టి దారిలో ప్రయాణించాల్సి వస్తోంది. బురద మట్టిలో నానుతూ, పాదరక్షలు లేకుండా నడకతో చిన్నారులు అడుగులు వేస్తున్నారు. చదువు చదవాలంటే ఇలా బురదలో నడవాల్సిందేనా...? అంటూ ఓ తల్లి వేదన వ్యక్తం చేస్తోంది. ఉదయాన్నే పుస్తకాలు చేతపట్టుకుని, మట్టి దారిలో నడుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ మార్గాన్ని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

బురదలో నడిచి వెళుతున్న విద్యార్థులు

విద్యార్థులకు యూనిఫాం క్లాత్ అందజేత

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మండలంలోని 98 పాఠశాలల్లో 516 మంది విద్యార్థులకు యూనిఫాం క్లాత్ అందజేస్తున్నట్టు ఎంఇఒ 2 సూరారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆ దుస్తులకు కుట్టుకూలిగా జతకు రూ.240 తల్లిదండ్రుల ఖాతాలో జమచేస్తామన్నారు. విద్యార్థులకు త్వరగా యూనిఫాంలు అందజేయాలన్నారు.

చింతూరు ఎంపిడిఒగా శ్రీనివాస్‌దొర

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ఎంపిడిఒగా సున్నం శ్రీనివాస్‌దొర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2015లో చింతూరు ఎంపిడిఒగా పనిచేశారు. అనంతరం 2016- 17 లో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మండలంలో పనిచేసారు. రంపచోడవరం ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం చింతూరు బదిలీపై వచ్చారు.

శ్రీనివాస్‌దొర

నేడు టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం ఈనెల 28న శనివారం జరగనుందని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు పట్టణంలోని విఆర్ ఫంక్షన్ హాలులో ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఐదు మండలాల నాయకులు, టిడిపి మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కమిటీలు, కెఎస్ఎస్‌లు, పార్టీకి చెందిన ఎంపిపిలు, జడ్ పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా శ్రీదేవి

ప్రజాశక్తి-చింతపల్లి:చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వడ్డాది మాడుగుల ప్రాజెక్ట్ నుంచి ఆమెను చింతపల్లికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, మండలంలో సుమారు 250 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ అవుతున్న అంగన్వాడి సరుకులు అన్ని కేంద్రాలకు సమయానికి, సక్రమంగా చేరేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు కలిసికట్టుగా పని చేస్తేనే లక్ష్యాలు చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీదేవి

రేషన్ కార్డులకు1,300 దరఖాస్తులు

ప్రజాశక్తి-జీకేవీధి: మండలంలో నూతనంగా రేషన్ కార్డులకు 1300 మంది దరఖాస్తు చేసుకున్నారని తహశీల్దార్ రామకృష్ణ తెలిపారు. తహసిల్దార్ కార్యాలయంలో విఆర్ఓ, విఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సీతారాం, ఆర్ఐలు మహాదేవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జిమాడుగుల: మండల కేంద్రంలో ఎస్ కొత్తూరు గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను స్థానిక జడ్పిటిసి వెంకటలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి చేయాలని ఆలోచనతో జిల్లా పరిషత్ నిధులతో పచ్చపల్లి గ్రామంలో నాలుగు లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం పనులను కూడా ప్రారంభించామని తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హనుమంతరావు, ఎంపీపీ వెంకట గంగరాజు, స్థానిక ఎంపీటీసీ చిన్నారావు, ప్రకాష్. నరసింహమూర్తి పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

వరదలను ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - చింతూరు: ఈ సంవత్సరం వరదలను ఎదుర్కొనేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో వరద సహాయక కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. చింతూరు, రంపచోడవరం పిఒలు అపూర్వ భారత్, కట్టా సింహాచలం, ఎఎస్పి మీనా, అసిస్టెంట్ కలెక్టర్ కమల చిరంజీవి, నాగ వెంకట సతీష్, డిఎఫ్ఒ భవిత, ఎపిఒ జనరల్ పి.జగన్నాథం సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వరద ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు మండలాల వారీగా అధికారులను, సిబ్బందిని నియమించామన్నారు. వరద సహాయక కార్యక్రమాల్లో భాగంగా మూడు నెలలకు సంబంధించిన రేషన్ ఎక్కడికక్కడ ముందుగానే తరలించామన్నారు. వరద బాధితులకు ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, వరదలు వచ్చిన వెంటనే బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు లాంచీలు, పడవలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భద్రాచలంలో వరదలకు సంబంధించిన హెచ్చరికలు వచ్చిన వెంటనే ముంపు బాధితులకు పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గత సంవత్సరం ఏ విధంగా సహాయ కార్యక్రమాలు చేశామన్నది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పిఒలు అపూర్వభారత్, సింహాచలం జిల్లా కలెక్టర్‌కి వివరించారు. సహాయ కార్యక్రమాల్లో ఎన్‌జిఒలను కూడా పాల్గొనేలా చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రులో వివిధ రకాలైన మందుల అందుబాటులో పెట్టాలని అదేవిధంగా ఎక్కడికక్కడ మలేరియా స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నాలుగు మండలాలకు సంబంధించిన ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ పి. అంబేద్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, జిల్లా ఉద్యానశాఖాధికారి రమేష్, వెలుగు ఎపిడి దేగలయ్య, డిఎల్‌పిఒ నరసింగరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్య, ఎఎంఒ విజయ భాస్కర్, తహశీల్దార్లు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాఠశాల సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి - సీలేరు : జికె వీధి మండలం సీలేరు ఎంపిపి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి అధ్యక్షతన హెచ్‌ఎం క్రాంతికుమారి శుక్రవారం సమావేశం నిర్వహించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. మధ్యాహ్న భోజన పథకం కుక్‌లుగా గత 20 సంవత్సరాలుగా కొప్పోజు నూకరత్నం, శ్రీ కన్య వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి బియ్యం, గుడ్లు మాత్రమే వస్తున్నాయి. ఉప్పు, పప్పులు, కాయగూరలు వంటనూనె వంటచెరుకు, ఇతర సామగ్రి నూకరత్నం ప్రతిరోజు తన డబ్బుతో కొనుగోలు చేసి విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారు. అయితే బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానన్నారు. ఇకనుంచి కేవలం కుక్‌గా మాత్రమే ఉంటానని ఆమె తెలిపింది. మధ్యాహ్న పథకానికి సరుకులు తేవడానికి ఎవరినైనా నియమించేవరకూ కొనసాగాలని హెచ్‌ఎం ఆమెకు తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకానికి కావలసిన కాయగూరలు ఇతర సరుకులు పెట్టుబడి పెట్టి తెచ్చేవాళ్ళు ఎవరైనా ఉంటే రావాలని విద్యార్థులు తల్లిదండ్రులను కోరారు. విద్యార్థి తల్లిదండ్రులు స్పందిస్తూ తమకు కూలి పనికి వెళ్తే తప్ప తమకు గడవదని అటువంటి పరిస్థితి లేదని చేతులెత్తేశారు. మరొకసారి కమిటి చైర్మన్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటుకు ఏ విధంగా ముందుకు వెళ్తే బాగుంటుందో ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని తీసుకొని ముందుకు సాగుదామని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం క్రాంతికుమారి

చెరువును తలపిస్తున్న కూనవరం బస్ స్టేషన్

ప్రజాశక్తి- కూనవరం : మండల కేంద్రం కూనవరంలో ఆర్టీసి బస్‌స్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోయి బురదమయంగా తయారైంది. దీంతో బస్సులు కూరుకుపోతున్నాయి. ట్రాక్టర్ సాయంతో వాటిని బయటికి తీయాల్సి వస్తోందని ప్రయాణికులు తెలిపారు. మూడు మండల కేంద్రాలకు ప్రతిరోజు నిత్యం 25 సర్వీస్‌లు నడుస్తున్నాయని ఇప్పటికైనా సిమెంటు రహదారి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - విఆర్ పురం : మండల కేంద్రంలోని రాజుపేటకాలనీ గ్రామంలో వనవాసి కళ్యాణ ఆశ్రమం విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గుండె జబ్బులు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులకు, లివర్ మొదలగు పెద్ద జబ్బులకు ఉచితంగా ఆపరేషన్ వనవాసి కళ్యాణం ఆశ్రమం హాస్పిటల్లో 10 లక్షల నుండి 20 లక్షల వరకు ఆపరేషన్లకు ఖర్చు తమ సంస్థ భరిస్తుందని పేషెంట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల కోఆర్డినేటర్ ప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంక్ అకౌంటు తప్పనిసరిగా క్యాంపునకు వచ్చేటప్పుడు తీసుకురావాలని తెలిపారు.

పోలీస్ అధికారులతో డిఐజి సమీక్ష

పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న డిఐజి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరులోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం డిఐజి జెట్టి గోపీనాథ్ జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు శాఖలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఇటీవల మావోయిస్టుల ఎన్కౌంటర్, జిల్లాలో మావోయిస్టుల కదలికలు, పోలీస్ స్టేషన్ ల భద్రత, మావోయిస్టుల కదలికల ఇన్ఫర్మేషన్ సేకరణ, వాహన తనిఖీలు, పోలీస్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.గంజాయి కేసులపై దృష్టి పెట్టాలని, కేసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్ట్ చేయాలని, గంజాయి సాగు అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగించి గుర్తించిన పంటలను ధ్వంసం చెయ్యాలన్నారు. మత్తు పదార్థాలతో జరిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గంజాయినిందితుల ఆస్తుల జప్తుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో అల్లూరి జిల్లా ఎస్ పి అమిత్ బర్దర్, అడిషనల్ ఎస్ పీలు ధీరజ్, జగదీష్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యుత్ మీటర్లతో అధిక బిల్లులు

విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: డిజిటల్ విద్యుత్ మీటర్లతో అధికంగా బిల్లులు వచ్చే అవకాశం ఉందని, దీని ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు నిలిచి పోతాయని సిపిఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ చింతపల్లి మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వాముగడ్డ గ్రామంలో గిరిజన మహిళల ఇంటింటి సందర్శించారు. ఈ సందర్భంగా డిజిటల్ మీటర్లను, తాజా విద్యుత్ బిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఒప్పందంతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ మీటర్లను అమలు చేస్తోందన్నారు. 300 యూనిట్లు దాటితే రేషన్ కార్డు, పెన్షన్, రైతు భరోసా, తల్లికి వందనం వంటి పథకాలు నిలిపివేయబడే ప్రమాదం ఉందన్నారు. డిజిటల్ మీటర్లకు కూడా ప్రీపెయిడ్ రీఛార్జ్ విధానం అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమని, దీన్ని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు,మహిళలు పాల్గొన్నారు.

మండల విలేకర్ల సంఘం నూతన కార్యవర్గం

అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, గంగాధర్

ప్రజాశక్తి- హుకుంపేట:మండల విలేకర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులు కిముడు గణేష్ అధ్యక్షతన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా కె. ఆనంద్, కార్యదర్శిగా కె. గంగాధర్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎల్. ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా కె. కొండబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, అఖిల్, దిలీప్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, "ప్రజా సమస్యలను వెలికి తీసి బాహ్య ప్రపంచానికి తెలియజేయడంలో విలేకర్లు కీలక పాత్ర పోషించాలన్నారు.

1న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు, మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్, టీటీడీ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు జన్మదిన వేడుకలను జూలై ఒకటిన నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్న దొర, డోకులూరు సర్పంచ్ కుర్రబోయిన సన్నిబాబు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణారావు, మాజీ సర్పంచ్ మినుముల కన్నాపాత్రుడు, కూడా సుబ్రహ్మణ్యం, రాజేష్, లంకెల కళ్యాణం, పాల్గొన్నారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

- సిఎం చంద్రబాబు పాడేరు ఏజెన్సీ పర్యటనలోగా స్పష్టతనివ్వాలి
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి -గాజువాక : వచ్చేనెల ఒకటిన పాడేరు ఏజెన్సీలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ లోగానే ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.చిన్నం నాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె చిట్టి బాబు, సిటీ కమిటీ సభ్యులు దామోదర డిమాండ్ చేశారు. కంచరపాలెంలోని సంఘం కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలపై నిర్ణయం ప్రకటించాలని కోరారు. చింతపల్లి, అరకు, అనంతగిరి పరిధిలోని బాక్సైట్ నిక్షేపాలను నాల్కోకు అప్పగించే ప్రయత్నంపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. జిఒ 3 ప్రయోజనాలు పునరుద్ధరణ, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై అరకు ఎన్నికల సభలో చంద్రబాబు హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఆదివాసీల ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందిందని మండిపడ్డారు. ఏజెన్సీలోని ఎర్రవరం,పెదకోట హైడ్రో పవర్ ప్రాజెక్టులను అదాని ప్రైవేట్ సంస్థలకు కారు చౌకగా అప్పగించే ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు..పాడేరు మెడికల్ కాలేజీ నిర్వాహణంపైప్రకటించలేదని, ఈ ఏడాది 100 సీట్లకు నేటికి అనుమతి ఇవ్వలేదన్నారు. .గిరిజన సంక్షేమ హస్టళ్లలో ఆరోగ్య కార్యకర్తలు, ఏజెన్సీ పాఠశాలల్లో భాషా వాలంటీర్లు, సిఆర్‌టిల రెన్యువల్స్, నియామకాలు లేక వందలాది పాఠశాలలు మూతబడినా ప్రభుత్వపరంగా తగు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులు, వాలంటీర్లను నియమించి, పాఠశాలలను తెరిపించాలని కోరారు.

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-పాడేరు టౌన్:ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. డిఆర్ఒ కె.పద్మలత, టిడబ్ల్యూ డిడి ఎల్.రజని పాల్గొని144 వినతులను స్వీకరించారు. భూ సమస్యలు, ఇళ్ల మంజూరు, ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని, పాఠశాలల ప్రవేశాలు, రహదారుల నిర్మాణాలపై అధికంగా ఫిర్యాదులు అందాయి. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎం. హేమలత, ఎస్ఎంఐ ఇఇ రాజేశ్వరరావు, డిఇ నాగేశ్వరరావు, సబ్ ట్రెజరీ అధికారి కృపారావు, వివిద శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఎఎన్ఎంల మెరిట్ జాబితా

డిఎంహెచ్ఒకు సిఐటియు ఆధ్వర్యాన వినతి

పాడేరు: వార్డు, సచివాలయం ఏఎన్ఎంలను గ్రేడ్:-3 నుండి ఎంపిహెచ్ఎ ఫిమేల్‌గా పదోన్నతి కల్పించి, ఖాళీలను స్థానిక జిల్లా వారికి మాత్రమే పూర్తి స్థాయిలో ప్రమోషన్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఐ టి డి ఏ లో జరిగిన మీకోసం పరిష్కార వేదిక లో సచివాలయ ఎఎన్ఎంల వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం గ్రామ వార్డు, సచివాలయలో ఏఎన్ఎంల నియామకం చేశారని, జిల్లాలో 88 ఖాళీ పోస్టులో ప్రమోషన్ ఇచ్చి పూర్తి చెయ్యాలని అధికారులు గత కొన్నిసార్లు మెరిట్ లిస్ట్ ప్రకటన చేసినప్పటికీ తప్పులతడకగా ఉన్నాయన్నారు. రేసలైజేషన్ పేరుతో 33 పోస్టులుకు కుదించడం జరిగిందన్నారు. 68 జీవో ప్రకారం పోస్టులన్ని పూర్తి చేయాలని కోరారు.సచివాలయం ఏఎన్ఎంలను గ్రేడ్:-3 నుండి ఎం పి హెచ్ ఎ ఫిమేల్ గా ప్రమోషన్ కలిపించాలని అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర నాయుడుకి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వివి కుమారి,ప్రధాన కార్యదర్శి .తుళ్లబోథి, అంబికా, కృష్ణ, లక్ష్మి, రాజమని, వరలక్ష్మి పాల్గొన్నారు.

గీతం వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు

- టైమ్స్ వరల్డ్ ర్యాంకింగ్‌లో 81వ స్థానం

గీతం డీమ్డ్ యూనివర్సిటీ

పజాశక్తి-మధురవాడ: ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం యుకె ఆధారిత ర్యాంకింగ్ సంస్థ టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ ర్యాంకింగ్‌లను సాధించిందని గీతం ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్, ర్యాంకింగ్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు తెలిపారు. నాణ్యతతో కూడిన ఉన్నత విద్య, పరిశ్రమలతో సంబంధాలు, నూతన ఆవిష్కరణలు, లింగ సమానత్వం, వనరులను బాధ్యతగా ఉపయోగించడం ఆర్థిక ప్రగతి బలమైన వ్యవస్థల నిర్మాణం, శాంతి, సమన్యాయం, ఆరోగ్యకరమైన వాతావరణం వంటి 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను పరిశీలించిన మీదట ఈ ర్యాంకింగ్‌లను ప్రకటించిందన్నారు.. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఒకట్కెన క్లిన్ ఎనర్జీ విభాగంలో గీతం విశ్వవిద్యాలయం ప్రపంచంలో 81వ స్థానంలో, దేశంలో 10వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటవ స్థానంలో నిలిచిందన్నారు. 11 విభాగాలలో గీతం విశ్వవిద్యాలయం రాష్ట్రంలో మొదటి స్థానం సాధించిందని వెల్లడిరచారు. ఈ ర్యాంకింగ్‌లను సాధించడంతో గీతం విశ్వవిద్యాలయానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలకు ఇస్తున్న ప్రాధాన్యతకు గుర్తింపుగా ఇప్పటికే నాక్ ఎ++ గ్రేడ్‌తో పాటు ఎన్ఐఆర్ఎఫ్. ర్యాంకింగ్‌ను, క్యూఎస్ ఆసియా విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌ను, ఎన్‌బిఎ ర్యాంకింగ్‌ను సాధించిందనితెలపారు.

కార్మికుల సమ్మె నోటీస్

:సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నేతలు.

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: వచ్చేనెల 9వ తేదీన దేశ వ్యాప్త సమ్మె నేపథ్యంలో పర్యాటక కేంద్రమైన అరకులోయ గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, కొత్తపల్లి జలపాతం, చాపరాయి, జిసిసి సోప్ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నట్లు శుక్రవారంస్థానిక యూనిట్ మేనేజర్లకు సమ్మె నోటీసు అందజేశారు. సిఐటియు అరకువేలి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సమ్మెను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు జె భగత్ రాం, ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు, జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.సింహాద్రి, మాట్లాడుతూ, కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. కార్మిక వర్గమంతా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలు రద్దు చేసి 10 గంటలు దినాన్ని పెంచడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తక్షణం కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కనీస వేతనం 26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్ అమలు చేయాలని, కొత్తగా జాయినింగ్ అయిన కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిసిసి వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ,రామ్ చందర్, దాసుబాబు, సత్యారావు, ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని జైపూర్ జంక్షన్ జాతీయ రహదారిలో శుక్రవారం డివైడర్‌ను కారు ఢీకొంది. తెలంగాణ నుంచి మన్యం అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు అరకు చేరుకుని చాపరాయి జలవిహారి సందర్శనకు బయలు దేరారు. మార్గ మధ్యలోని అరకు-పాడేరు ప్రధాన రహదారి జైపూర్ కూడలి జాతీయ రహదారిలో ప్రమాదవశాత్తు కారు డివైడరును ఢీకొట్టింది. పల్టీలు కొట్టి పక్కకు ఒరిగిపోయింది. . పర్యాటకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని కోట్నపల్లి పంచాయతీ పరిధిలోని మత్స్యపురంలో గొర్రెలు, మేకల ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక అధికారి జయప్రకాశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొదిలి గ్రామంలో జరిగిన మందులు పంపిణీని పరిశీలించారు.గ్రామాల్లో గొర్రెలు, మేకల నట్టల నివారణకు పూర్తి స్థాయిలో సేవలందించాలని పశుసంవర్ధక సిబ్బందిని ఆదేశించారు.

దివీస్‌కు 'రెడ్‌క్రాస్' అవార్డు

అవార్డు అందుకుంటున్న మహేంద్ర, మల్లికార్జున్

ప్రజాశక్తి -తగరపువలస : 15 ఏళ్లుగా రక్తదాన శిబిరాలు ద్వారా వెయ్యి మందికి పైగా దివీ స్ ఉద్యోగులు, వెయ్యి యూనిట్ల రక్తం అందజేసి నందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెడ్‌పి కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో చిప్పాడ దివీస్ సంస్థకు ఆ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అవార్డును ప్రదానం చేశారు. దివీ స్ సంస్థ ప్రతినిధులు మహేంద్ర, మల్లికార్జున్ అవార్డును అందుకున్నారు. తమ సంస్థ సేవలను గుర్తించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు ప్రదానం చేయడం సంతోషంగా ఉందని దివీస్ జిఎం, వైఎస్ కోటేశ్వరరావు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలం నడింపాలం గిరిజన సంక్షేమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పివి కృష్ణమూర్తి గొలుగొండ మండలం చీడికాడ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు బయలుదేరి, చీడికాడ జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.కృష్ణమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

దగ్ధమైన పూరిల్లు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలం చింతలపూడి పంచాయతీ లుబ్బర్తిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన తూబే బంగార్రాజు అనే వ్యక్తికి చెందిన పూరింటిలో ప్రమాదవశాత్తూ నిప్పులు తాటాకులపై పడి మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. కట్టుబట్టలతో బయట పడ్డామని ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం కాలిపోయిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

హార్టికల్చర్ రైతులను గుర్తించాలి

ప్రజాశక్తి - వై.రామవరం: గ్రామ సచివాలయం నందు, ఉపాధి సిబ్బందితో ఎంపిడిఒ బాపన్నదొర శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఫారం పాండ్స్ పూర్తి చేయాలి. హార్టికల్చర్ రైతులను గుర్తించి అందరికీ అంచనాలు వేయాలన్నారు. ఫీల్డ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

తునికాకు నగదు చెల్లించాలి

ప్రజాశక్తి - చింతూరు: నాలుగు మండలాల్లో రెండో పంటగా తునికాకు సేకరించినా ఇప్పటి వరకూ నగదు చెల్లించలేదని, పెండింగ్ బోనస్ కూడా ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్‌ను కలసి మాట్లాడారు. ఉపాధి వేతనదారులకు చెల్లింపులు జరపాలన్నారు. వరద బాధితులకు ముందుగానే రీహేబిటేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. కలెక్టర్‌ను కలసిన వారిలో సిపిఎం నాయకులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, మొట్టుమ్ రాజయ్య, పొడియం జానీ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఇంటర్‌లో 131 సీట్లు ఖాళీ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి131 సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. బైపిసి, ఎంపిసి, సిఇసి, హెచ్ఇసి, సిఎస్‌సి గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 30లోగా నేరుగా కళాశాలకు సర్టిఫికెట్స్ తో వచ్చి ప్రవేశం పొందాలన్నారు.

చిన్నగంగవరం వంతెన నిర్మించరూ..!

గత ఏడాది కొట్టుకుపోయిన వంతెన

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతి చిన్నగంగవరం వంతెన గత ఏడాది సెప్టెంబర్ 8న కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వంతెనపై ఆధారపడి పెద్దగంగవరం, చిన్నగంగవరం, నరమామిడి, గోంది, పెట్రాయి గ్రామాలు ఉన్నాయి. వైద్యసదుపాయం పొందాలన్నా నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్న దారకొండకు ఈ మార్గం ద్వారా వంతెనపై నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అప్పట్లో కొట్టుకుపోయిన వంతెనను అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తరువాత నిర్మాణ పనులు చేపట్టడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఒరిస్సా నుంచి పలు గ్రామాల ప్రజలు దగ్గరగా ఉన్న దారకొండ వారపు సంతకి వైద్యసేవలు పొందడానికి వస్తూ పోతూ ఉంటారు. గత్యంతరం లేక చిన్నగంగవరం గ్రామస్తులు శ్రమదానంతో రహదారి ఏర్పాటు చేసుకుని వంతెనపై తాత్కాలికంగా రాళ్లు పేర్చి రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అవికూడా కొట్టుకుపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అత్యవసర సమయంలో రోగులను అంబులెన్స్‌లో తరలించడానికి మార్గం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన బాగుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే పనులు చేపట్టలేదు..

అధికారులు నిర్లక్ష్యం వల్లే చిన్న గంగవరం వంతెన పనులు చేపట్టలేదు. ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని చర్యలు చేపట్టాలి.

– దొక్కు బాబు, జనసేన నాయకులు

వరద వచ్చి పదినెలలైనా చర్యలు శూన్యం

చిన్న గంగవరం వంతెన నిర్మాణం చేపట్టడానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడిఎ పిఒ స్పందించాలి. వరద విపత్తు వచ్చి పది నెలలు గడుస్తున్నా నేటికీ పనులు చేపట్టకపోవడం విచారకరం.

– కవర్ల భగవాన్, సిపిఐ మండల నాయకులు

ఖాతాదారుల ఆదరాభిమానాలతో ముందడుగు

మాట్లాడుతున్న కనకమహాలక్ష్మి కోఆపరేటివ్‌బ్యాంకు అధ్యక్షుడు రాంబాబు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్: ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 26వ మహాజనసభ శుక్రవారం ఎన్ఆర్‌సి కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. సమావేశానికి బ్యాంకు అధ్యక్షులు కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరాభిమానాలతో తమ బ్యాంకు అభివృద్ధి పథంలో ముందడగు వేస్తోందన్నారు. కేవలం బ్యాంకింగ్ కార్యకలాపాలు మాత్రమే కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటున్నా మన్నారు. ఇప్పటికి 9 జిల్లాలో 34 శాఖలుగా విస్తరించి ఉందని, రానున్న కాలంలో మరిన్ని శాఖల ఏర్పాటుకి రిజర్వ్‌బ్యాంకుకి దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికి రూ.1020 కోట్లు డిపాజిట్లను కలిగి, రూ.680 కోట్లు రుణాలను మంజూరు చేసి, రూ.11.20 కోట్లు నిఖర లాభంతో ముందుకు సాగుతుందన్నారు.

ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న నలుగురు, ఇంటర్మీడియెట్ చదువుతున్న నలుగురు సభ్యుల పిల్లలకు ప్రశాంసాపత్రాలతో పాటు, రూ.5వేలు ప్రోత్సాహక నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యుల షేరు ధనంపై 14 శాతం డివిడెండు ప్రకటించడంతో సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్ రామకృష్ణ, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, పాలకవర్గం సభ్యులు రాఘవేంద్రరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, సిపిరామారావు, తదితరులు పాల్గొన్నారు.

మీడియా, పోలీసులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: మీడియా, పోలీసు వ్యవస్థలు రెండు సమాంతరంగా, సమన్వయంతో పనిచేయడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. నూతనంగా ఎన్నికైన విశాఖపట్నం క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం పోలీస్‌కమిషనర్‌ని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దాడి రవికుమార్ అసోసియేషన్ కార్యకలాపాలు గురించి కమిషనర్‌కు వివరించారు. కొన్నేళ్లుగా క్రైమ్ రిపోర్టర్‌లు పోలీసుశాఖతో కలిసి నిబద్ధతతో, సమన్వయంతో ఎలా పనిచేస్తున్నారో వివరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ విలేకరులు అప్రమత్తంగా, వివాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.

అసోసియేషన్ కార్యదర్శి ఎబిఎన్ సతీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్.బానోజీ (ఇండియా టుడే), కోశాధికారి పొట్నూరు వాసు (హన్స్ ఇండియా), వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.ఆర్. ప్రసాద్(వి.డిజిటల్) ఉపాధ్యక్షులు బండి శివరామకృష్ణ (ఏఎన్ఐ), జె.శేషగిరి(ఎస్‌డివి), సంయుక్త కార్యదర్శులు ఏ.నరేష్ (సాక్షి), కార్యవర్గ సభ్యుడు భాగ్యరాజ్ (ప్రజాశక్తి) సిపిని కలిసిన వారిలో ఉన్నారు.

మాజీమంత్రి పసుపులేటికి వినతిపత్రం ఇస్తున్న సాధనకమిటి నాయకులు

రహదారి బాగుచేయాలని మాజీ మంత్రి పసుపులేటికి వినతి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం అంతర్రాష్ట్ర రహదారి సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ మంత్రి పసుపులేటి బాలరాజుకు మర్యాదపూర్వకంగా కలిసి, రహదారి సమస్యపై వినతి పత్రం అందజేశామని సాధన కమిటి నాయకులు కారే శ్రీను, సర్పంచ్ పాంగి దుర్జో జనసేన నాయకులు బత్తుల మార్కురాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జికె వీధి మండలం ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు పెద్ద పెద్ద గోతులతో రహదారి అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి బాలరాజుకు వినతిపత్రం అందజేస్తూ తమకి మద్దతుగా నిలవాలని కోరగా సమస్యలు పరిష్కరించడానికి కచ్చితంగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సాధన కమిటి డిమాండ్ చేసింది. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బాబురావు, అల్లంకిరాజు, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర, వానపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - వై.రామవరం: రైతులకు సబ్సిడిపై వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని వ్యవసాయ సిబ్బంది తెలిపారు.వై.రామవరం, రైతుసేవా కేంద్రాలలో 90శాతం సబ్సిడిపై విత్తనాలు అందించామని ఏ కేటగిరి ధాన్యం 1121 రకం 35 కేజీల బ్యాగు రూ.135కు, రెండో రకం ఏటి యు 1318రకం 135 రూపాయలు ఆర్‌జిఎల్ 2537రకం రూ.145కు రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బాపన్నదొర, ఎంపిపి ఆనంద్, జెడ్పిటిసిలు పాల్గొన్నారు.

వినియోగదారుల కేసులో విజయం

- బాధితునికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా కమిషన్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మధురవాడలో గ్లోబల్ ఏంట్రా పోలీస్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రెండు 2014లో అపార్ట్మెంట్ నిర్మాణం చేపట్టగా, రాకేష్‌కుమార్‌శర్మ అనే వ్యక్తి 2011 చదరపు అడుగుల ఇంటికి పూర్తి సొమ్ము రూ. 45లక్షల 42 వేలు చెల్లించాడు. 2015 డిసెంబర్‌కి ఇంటిని అప్పగించాల్సి ఉండగా, ఏడు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంటిని అప్పగించకపోవడంతో రాకేష్‌కుమార్‌శర్మ తమను ఆశ్రయించారని, నేషనల్ కన్స్యూమర్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు పి.వికాస్‌పాండే తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏడాదిలో ఫ్లాట్ అప్పగించకుండా, 2021లో జిఎస్‌టి వగైరా ఖర్చులకు అదనంగా డబ్బు చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. దీంతో తమ కౌన్సిల్ తరఫున జిల్లా వినియోగ దారుల విభాగాల పరిష్కార కమిషన్ కు 2022లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదుల వాస్తవాలను పరిశీలించి, కౌన్సిల్ బుధవారం తీర్పు చెబుతూ, బాధితునకు 45 రోజుల్లో ఫ్లాట్ అప్పగించాలని, అలాగే 2016 జనవరి ఒకటి నుంచి నెలకు రూ.6030 చొప్పున చెల్లించాలని, రూ.10లక్షలు నష్టపరిహారంగా చెల్లించాలని కౌన్సిల్ ఆదేశించిందన్నారు. 45 రోజులు దాటితే రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని కౌన్సిల్ జడ్జి తీర్పు చెప్పారని తెలిపారు. ఇది వినియోగదారుల విజయం అని వికాష్ పాండే తెలిపారు.

రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: నగరంలోని ఎంవిపి కాలని రైతుబజార్‌ను విశాఖ జిల్లా మార్కెటింగ్ శాఖ డిడి శ్రీనివాస్ కిరణ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు, వినియోగదారులతో మాట్లాడి రైతుబజార్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు, దివ్యాంగులకు కేటాయించిన స్టాల్స్ ను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతుబజారుకు మంచి నాణ్యత గల కూరగాయలు తెచ్చి వినియోగదారులకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకుడు కనకరాజు ఉన్నారు.